క్లుప్తంగా

కరోనా పరీక్షలు / విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

[illegible] పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు [illegible] సిగ్నేచర్ టవర్స్, మీనాక్షి అపార్ట్‌మెంట్స్, ఆదిత్య అపార్ట్‌మెంట్స్, జూబ్లీగార్డెన్, అపర్ణా అపార్ట్‌మెంట్స్, భిక్షపతినగర్, రాఘవేంద్రకాలనీ ఏబీసీ బ్లాక్స్, రాజరాజేశ్వరినగర్, జాగృతి కాలనీ, కొత్తగూడ వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నృత్యార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం అన్నమయ్య స్వరార్చనలో భాగంగా రాజేశ్ డ్యాన్స్ అకాడమీ శిష్య బృందం నృత్యార్చన చేశారు. సమన, అనఖ, గీతిక, భవ్యశ్రీ, నందికశ్రీ, పూజ్యశ్రీ, రిధిమా, రియా, పూర్విక, షన్విక, బి.షన్విక, తేజస్వీ, ప్రవస్థి, సహస్ర, మేఘన, పర్థిక, వర్షిని, సంయుక్తంగా గజనాయుతం, వినయకౌత్వం, బ్రహ్మకడిగిన పాదము, ముద్దుగారే యశోద, వరాహరూపం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. అనంతరం డాక్టర్ శోభరాజు వారిని సన్మానించారు.

టీ వర్క్స్‌లో 'ఆర్ట్ మీట్ అప్'

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ ప్రాంగణంలో అతిపెద్ద 'ఆర్ట్ మీట్ అప్ కార్యక్రమాన్ని టీవర్క్స్‌తో పాటు బియాండ్ హైదరాబాద్, అర్బన్ స్కెచర్స్, హైదరాబాద్ సైక్లింగ్ రివల్యూషన్‌ల సహకారంతో ఆర్ట్ మీట్ అప్ కార్యక్రమాన్ని నిర్వహించింది. నగరంలోనే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొనడంతో టీ వర్క్స్ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా టీ వర్క్స్ సీఈఓ సుజయ్‌కరంపురి మాట్లాడుతూ సమాజంలోని అన్ని విభాగాల వారిని ప్రోటోటైపింగ్ అవసరాల కోసం అత్యుత్తమ యంత్రాలు, పరికరాలను ఉపయోగించుకునేలా ప్రోత్సహిస్తామన్నారు.

ఉత్సాహంగా 5కే రన్



రాయదుర్గం: ఓటర్ల చైతన్యం కోసం నిర్వహించిన 5కే రన్ ఉత్సాహంగా సాగింది. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద ఈ రన్ శనివారం ఉదయం 6 గంటలకు వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి ప్రారంభించారు. రాయదుర్గం మల్కంచెరువు, దాబా కూడలి, బయోడైవర్సిటీ పార్కు కూడలి, సైబరాబాద్ కమిషనరేట్, గచ్చిబౌలి కూడలి, ఇందిరానగర్, ట్రిపుల్‌ఐటీ కూడలి మీదుగా గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల 21వ తేదీన ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా సరిగా ఉందో లేదో ప్రతి ఓటరు విధిగా పరిశీలించుకోవాలన్నారు. వారాంతాలలో బీఎల్ఓ కేంద్రాలలో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంహెచ్ఓ డాక్టర్ నగేష్, ఏఎంసీ శ్రావణ్‌రెడ్డి, ఎస్ఎస్ జలంధర్‌రెడ్డి, సర్కిల్ పరిధిలోని బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

కాలనీలు.. ఓట్లు పెరుగుతున్నాయ్..

- 7 లక్షలకు చేరువలో శేరిలింగంపల్లి సెగ్మెంట్
- ఓటరు నమోదు స్పెషల్‌డ్రైవ్‌కు అనూహ్య స్పందన



శేరిలింగంపల్లి గుల్‌మొహర్‌పార్కు కాలనీలో ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్)

శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు ఉన్న అసెంబ్లీ నియోజకవర్గంగా శేరిలింగంపల్లి ఇప్పటికే గుర్తింపు పొందింది. ఇంకా మరింతగా ఓట్లు పెరిగే అవకాశం ఉంది. ఓటరు నమోదు, మార్పుల కోసం ఇటీవల నిర్వహించిన అవగాహన సదస్సులు, స్పెషల్‌డ్రైవ్‌లు, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. దీంతో రాబోయే కాలంలో శేరిలింగంపల్లిలో 7 లక్షల వరకు ఓటర్లు చేరే అవకాశం లేకపోలేదు. ఇది కూడా ఓ రికార్డు కానుంది. ముఖ్యంగా శేరిలింగంపల్లికి దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా వలసలు పెరిగిపోవడంతో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్లలో ఓటరు నమోదు ప్రక్రియకు మంచి స్పందన..

- జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆదేశంపై అధికారులు, ఉద్యోగులు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 10 డివిజన్లలో చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియకు మంచి స్పందన కనిపించింది.
- ముఖ్యంగా జీహెచ్ఎంసీ అధికారులు గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్టుమెంట్లలో ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు.
- ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన డ్రైవ్‌లో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు.
- ఫారం-6 కింద 6,566 మంది కొత్తగా ఓటర్లుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా, ఫారం-8 కింద చిరునామా, పేర్లు, ఇంటిపేర్లు, ఇతర మార్పుల కోసం 3,779 మంది నుంచి దరఖాస్తు చేసుకొన్నారు.

21వ తేదీన డ్రాఫ్ట్ నోటిఫికేషన్..

- శేరిలింగంపల్లిలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం గడువు ఇచ్చారు.
- దీంతో ఆన్‌లైన్‌లో, అధికారుల పర్యటన ద్వారా సేకరించిన వాటిని క్రోడీకరించి ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని నిర్ణయించారు. అందుకోసం ఈనెల 21వ తేదీగా అధికారులు నిర్ణయించారు.

ఓటింగ్ శాతం పెంచడంపై దృష్టి..

- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉండటం తెలిసిందే.
- ఎన్నికలు రానున్న నేపథ్యంలో అధికారులు ఓటింగ్ శాతం పెంచడంపై ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.
- గతంలో 50 శాతం వరకు పోలింగ్ నమోదు కాగా, ఇకపై పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.
- అందులో భాగంగానే ఈ 19వ తేదీన ఓటర్లను చైతన్యపర్చేందుకు రాయదుర్గం మల్కంచెరువు నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు 5కె రన్ నిర్వహించారు.
- ఓటు విలువలను అందరూ గుర్తించి ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకొనేలా చేయాలని సంకల్పిస్తున్నారు.

పోలింగ్ శాతం గణనీయంగా పెరిగేలా



ఈనెల 21వ తేదీన ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తాం. ఇటీవల ఓటరు నమోదు ప్రక్రియకు అనూహ్య స్పందన వచ్చింది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోలింగ్ శాతం గణనీయంగా పెరిగేలా విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని సంకల్పించాం.

–రజనీకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్

మహోన్నత వ్యక్తి సర్వాయి పాపన్నగౌడ్

రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మియాపూర్: బహుజనుల అభ్యున్నతి కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మియాపూర్ ఆల్విన్ చౌరస్తాలో శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ కాంస్య విగ్రహాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పాపన్న గొప్పతనాన్ని భావి తరాలకు తెలిసేలా శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం సభ్యులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్‌రెడ్డి, గీతా కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలస్వామి లక్ష్మీనారాయణగౌడ్, కార్పొరేటర్లు పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, రాగం నాగేందర్‌యాదవ్, బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్, గౌడ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- టాస్క్‌లు కమిషన్ల పేరుతో సైబర్ మోసం
- 5 లక్షల, 33 వేలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్‌ల కోసం సెర్చ్ చేయగా ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు స్పందించిన ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి రూ.5 లక్షల 33 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు శివారులోని కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జూలై 22వ తేదీన పార్ట్ టైం జాబ్ కోసం సెర్చ్ చేస్తుండగా తన వాట్సాప్ కు మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు.ముందుగా టాస్క్ ఇచ్చి బాధితుడి ఖాతాలో రూ.150 వేశారు.దీంతో ఉద్యోగి ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు.కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు పలు దఫాలుగా రూ.5 లక్షల 33 వేలు వేశాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వ్యాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు.దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయిన్నట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువు విజయ లక్ష్మీ శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో వినాయకకౌతం, మహాగణపతిం, బ్రహ్మాంజలి, జయతు జయతు, భారతం, దేశభక్తి గీతం, విన్నపాలు వినవలే, రామాయణ శబ్దం, తరంగం తదితర అంశాలను ప్రదర్శించారు. తేజస్విని, ప్రణవిలత, లాస్య, సిరి, అక్షయ, నేహా, సాయి, దామిని తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు ఏబికే ప్రసాద్, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ ప్రొఫెసర్ డాక్టర్ కోనార్క్ సక్సేనా, భారత రంగస్థలి అధ్యక్షులు డాక్టర్ నర్సయ్యలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం



బొల్లారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- రూ.1.140 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జిన్నారం మండలంలోని శివానగర్, నల్తూర్, ఖాజీపల్లి గ్రామాలతో పాటు బొల్లారం మున్సిపల్ పరిధిలో రూ.1.40కోట్లతో చేపట్టనున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపనలతోపాటు పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఖాజీపల్లి గ్రామంలో నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నిరకాల వైద్య సేవలను సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్‌లతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో వసతులు కల్పించాలని వినతి

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వసతులు కల్పించాలని దక్షిణ మధ్య డివిజనల్ రైల్వే మేనేజర్‌కు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ శనివారం వినతిపత్రం అందజేశారు. అమృత్‌భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా లింగంపల్లి స్టేషన్‌లోని సికింద్రాబాద్ వైపు ప్లాట్‌ఫారం 1, 2లను కలుపుతూ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్ సదుపాయంతో పాటు 4వ ప్లాట్ ఫారంలో వికారాబాద్ వైపు లిఫ్ట్ ఏర్పాటు, ప్లాట్‌ఫారం -1లో వికారాబాద్ వైపు అదనంగా లోపలికి, బయటకు వెళ్లేందుకు ద్వారాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా ప్లాట్‌ఫారం 1,6లలో ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌లలో షెడ్ల నిర్మాణం చేయాలని కోరారు.

ఆల్విన్ కాలనీలో గడపగడపకు రవన్న ప్రజాయాత్ర



హఫీజ్‌పేట్ : రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ప్రజల సమస్యలు దూరం చేస్తానని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో బీజేపీ గడపగడపకు రవన్న ప్రజాయాత్ర ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ప్రజల కష్టాలను మరిచి రియల్ ఎస్టేట్ మీద దృష్టి పెట్టి అమాయక ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. ఈ ప్రజాయాత్రలో బీజేపీ నాయకులు శ్రీధర్ గౌడ్, టర్బో శ్రీనివాస్, యాదగిరి, సత్యనారాయణ, మహేష్, లక్ష్మణ్, మాణిక్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోవాలని వినతి

మియాపూర్: మియాపూర్‌లో భూఆక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. మియాపూర్ పటేల్‌చెరువులో ఫెన్సింగ్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

టీఎస్ ఆర్‌టీసీ గమ్యం యాప్‌తో..

- బస్సుల రాకపోకల వివరాలు తెలుసుకోవచ్చు

మూసాపేట: టీఎస్ ఆర్‌టీసీ గమ్యం యాప్‌తో ప్రయాణికులు బస్సుల రాకపోకల వివరాలు తెలుసుకోవచ్చని డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్ వివరించారు. మూసాపేటలోని ఆర్‌టీసీ బస్‌షెల్టర్‌లో శనివారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. నగరంలో ఏ బస్‌షెల్టర్ వద్ద ఉన్నా ఆ రూట్‌లో బస్ వచ్చే సమయం తెలుసుకోవచ్చు అని వివరించారు. ప్రయాణికులకు మరిన్ని సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



కంకర తేలి.. ప్రమాదకరంగా..

ఆల్విన్‌కాలనీ ఫేజ్- 2లో అంతర్గత రహదారుల దుస్థితి





కంకర తేలి నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్న రోడ్లు

ఆల్విన్‌కాలనీ: అంతర్గత రహదారులు రాళ్లు రప్పలు తేలి గుంతలమయం కావడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ ఫేజ్ టు లోని సి బ్లాక్ చివరి బస్టాప్ ఎదురు వీధుల్లో, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం చుట్టూ ఉన్న వీధుల్లో నడవాలంటే ప్రాణ సంకటంగా మారింది. గత రెండు సంవత్సరాల క్రితం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం తవ్వారు. పనులు పూర్తి అయిన తరువాత వదిలేశారు. దీంతో కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ కంకర తేలి ప్రమాదకరంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు తెలిపారు. రాత్రిపూట నడవాలంటే భయపడుతున్నామని పేర్కొంటున్నారు. చిన్నారులు వృద్ధులు పడిపోయారని స్థానికులు మండిపడుతున్నారు. పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు చెప్పారు. అధికారులు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించటంలో లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆల్విన్ కాలనీ ఫేజ్ 2లోని శివాలయం చుట్టు పక్కల వీధుల్లో రోడ్డు సమస్యలు పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండు సంవత్సరాల క్రితం తవ్వారు..



రెండు సంవత్సరాల క్రితం రోడ్డును తవ్వి డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. తిరిగి రహదారి నిర్మించకుండా వదిలివేయడంతో ద్విచక్ర వాహనదారులు, వయో వృద్ధులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం నడవాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. కిందపడి గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. రోడ్డు వేయాలి.

–సాంబమూర్తి, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2

వరల్డ్ ఫొటోగ్రఫీ డే

హఫీజ్‌పేట్: వరల్డ్ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకొని శనివారం మియాపూర్ ఆల్విన్‌క్రాస్ రోడ్‌లో ఫొటోగ్రాఫర్లు కేక్ కట్ చేశారు. ఫొటోగ్రాఫర్లు విజయ్‌రాజు, అన్వర్, గణేష్, మహేష్, శేఖర్, సత్యనారాయణ, ప్రవీణ్, రాజు, హర్ష, విష్ణు పాల్గొన్నారు.

సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఫొటో,వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. శనివారం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆమె ఫొటోగ్రాఫర్లను సన్మానించి, మెమెంటోలను అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి జీవితంలో మధుర జ్ఞాపకాలు ఫొటోలు అని ఆమె వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అంజిరెడ్డి, ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షులు కృష్ణ యాదవ్, నాయకులు వెంకటేష్, అఖిల్, ఆంజనేయులు, రియాజ్ తదితరులు ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

హెచ్‌సీయూలో 'క్లీనప్ డ్రైవ్'



క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్న వాలంటీర్లు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) విభాగం, హెచ్‌సీయూ హార్టికల్చర్ విభాగంతో కలిసి క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ ప్రాంతంలో టెర్రస్‌పై పేరుకుపోయిన చెత్తాచెదారంను తొలగించారు. వర్షం కురుస్తున్నా వాలంటీర్లు 4 గంటలపాటు శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్‌లు మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌ను క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్‌గా మార్చడమే ఎన్ఎస్ఎస్ విభాగం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖకు చెందిన ప్రియాంక ప్రియదర్శిని, సుప్రభ మహ్తో, మహ్మద్ జునైద్, మహేందర్, అజయ్‌ప్రకాశ్, సన్నీకుమార్, సోనువర్మ, యోగేంద్ర ప్రతాప్‌సింగ్, సందీప్‌సింగ్, పొనగంటి అభిలాష, కె వెంకటదాస్, ప్రకాశ్ బృందం పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



ఈశ్వరి (ఫైల్)

హఫీజ్‌పేట్ : బాలిక అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. లింగంపల్లి రైల్వేస్టేషన్ 6వ ప్లాట్ ఫారం వైపు ఉన్న గుడిసెలలో నివాసముండే ఈదుల యాదమ్మ చెత్త కాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తుంది. ఆమె కూతురు ఈశ్వరి (14) ఈ నెల 15వ తేదీ ఉదయం 8 గంటలకు టీ తీసుకుని వస్తానని చెప్పి గుడిసె నుంచి బయటకు వెళ్ళింది. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం చందానగర్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చిన్నారి బయటకు వెళ్ళేటప్పుడు ఎర్రటి కుర్తా వేసుకుంది. ఎత్తు 4.5 ఫీట్లు ఉంటుందని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మాదాపూర్: గుర్తుతెలియని వ్యక్తి దుర్గం చెరువులో పడి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గత రెండు రోజుల క్రితం చెరువులో పడిపోయి ఉండవచ్చని తెలిపారు. వాకింగ్ చేస్తున్నప్పుడు జారిపడి పోయి ఉండవచ్చన్నారు. వయస్సు(40), బ్లూ కలర్ షార్ట్, ఎత్తు, 5.8 అని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించినట్లు తెలిపారు.